# వానకాలం కొనుగోళ్లకు సర్వం సిద్ధం

- 2.15 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం లక్ష్యం

మంచిర్యాల అర్బన్, నవంబర్ 4 : 2023-24 వానకాలం ధాన్యం సేకరణకు అధికారులు అంతా సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,57,443 ఎకరాల్లో వరి సాగవగా, 3.46 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి రానుందని, ఇందులో లక్షా 57 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అక్టోబర్ చివరి వారంలో కోతలు ప్రారంభం కాగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి చేరుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సివిల్ సప్లయ్ అధికారులు అంతా సిద్ధం చేసి కొనుగోళ్లు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చి చేరుతుండడంతో ఈ నెల రెండో వారంలో కొనుగోళ్లు ప్రారంభించేందుకు సంబంధిత శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**మూడు ఏజెన్సీల ద్వారా సేకరణ..**

జిల్లా వ్యాప్తంగా 1,57,443 ఎకరాలలో వరి పంట సాగవగా ఇందులో రైతులు 60,968 ఎకరాల్లో ఇంటి అవసరాలకు సన్నరకాలు సాగు చేశారు. ఇంటి అవసరాలకు పోను సన్నాలలో వెరైటీ (హైబ్రీడ్) పంటలను నేరుగా మిల్లర్లకు అమ్ముకోవడం, మరి కొంత మంది రైతులు వచ్చే సీజన్‌కు విత్తనాల కోసం వాడుకోవడం లాంటివి మినహాయిస్తే కొనుగోలు కేంద్రాలకు 2.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రానుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఈ ధాన్యాన్ని మూడు ఏజెన్సీల పరిధిలోని 262 (డీఆర్‌డీఏ ఐకేపీ - 43, పీఏసీఎస్-130, డీసీఎంఎస్ - 89 ) ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం జిల్లాలోని 54 (35 రా రైస్, 19 బాయిల్డ్) మిల్లులకు ధాన్యం తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

**మద్దతు రూ. 143 పెంచి కొనుగోళ్లు..**

ప్రభుత్వం ఏటేటా మద్దతు ధరను పెంచుతూ రైతులకు అండగా నిలుస్తోంది. గతేడాది క్వింటాలు గ్రేడ్-ఏ రకానికి రూ. 2060, కామన్ రకానికి రూ. 2040 చెల్లించి కొనుగోలు చేసిన ప్రభుత్వం ఈ ఏడాది క్వింటాలుకు రూ.143 పెంచి కొనుగోలు చేస్తుంది. ఈ ఏడాది క్వింటాలు 'ఏ' గ్రేడ్ ర కానికి రూ. 2203 చెల్లించనుండగా సాధారణ రకానికి రూ. 2183 చెల్లించి కొనుగోలు చేయనుంది. కొనుగోళ్లకు కావాల్సిన ఏర్పాట్లను సిపిల్ సప్లయ్ అధికారులు, కార్పొరేషన్ అధికారులు చేస్తున్నారు.

**అంతా ఆన్‌లైన్‌లో..**

కొనుగోలు కేంద్రాల్లో మోసాలు జరుగకుండా ఉండేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలో కొనుగోలు ప్రక్రియను ప్రారంభించింది. ఇందు కోసం ట్యాబ్లెట్ పీసీలను గతంలోనే అందజేసింది. రైతు ధాన్యం తీసుకువచ్చినప్పటి నుంచి తూకం, లారీ లోడింగ్, మిల్లర్‌లో చేరేంత వరకు అన్ని ఆన్‌లైన్‌లో నమోదవుతాయి. అలాగే ప్రతిరోజు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు.. ఎంత ధాన్యం మిల్లుకు చేరుకుందో రిపోర్టు నమోదు చేయాల్సి ఉంటుంది. కొనుగోలు కేంద్రాల నిర్వహణపై నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఇది వరకే శిక్షణ కార్యక్రమాలను నిర్వహించింది. మరోవైపు రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు మద్ధతు ధరతో కొనుగోలు చేసేలా సంబంధిత శాఖలు చర్యలు చేపట్టాయి.

**2.15 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం..**

జిల్లాలో ఈ ఏడాది వానకాలం 4,57,618 ఎకరాల్లో వివిధ పంటలు సాగవగా, వరి పంట 1,57,444 ఎకరాల్లో సాగైంది. ఇందులో 96,466 ఎకరాల్లో దొడ్డు రకం సాగవగా 60,968 ఎకరాల్లో సన్న రకం, 10 ఎకరాల్లో సీడ్ విత్తనాలు సాగు చేశారు. ఈ ఏడాది మొత్తం 3,46,376 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేయగా, కొనుగోలు కేంద్రాలకు 2.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రానుందని అంచనా వేశారు. బెల్లంపల్లి మండలంలో 4,851 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుండగా కాసిపేటలో 1,554 మెట్రిక్ టన్నులు, తాండూరులో 112 , భీమినిలో 64, కన్నెపల్లిలో 4,161, నెన్నెలలో 3,398, వేమనపల్లిలో 8,952, భీమారంలో 10,794, చెన్నూర్‌లో 31,230, జైపూర్‌లో 27,412, కోటపల్లిలో 15,7559, మందమర్రిలో 337, దండేపల్లిలో 40,758, హాజీపూర్‌లో 17,344, జన్నారంలో 23,458, లక్షెట్టిపేటలో 22,044 మెట్రిక్ టన్నులు రానుందని అంచనా వేశారు. కొంత మంది రైతులు కొనుగోలు కేంద్రాలకు సన్న రకం ధాన్యాన్ని విక్రయిస్తారనే అంచనా జిల్లా వ్యాప్తంగా 2,15,492 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు.



హాజీపూర్‌లో కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం

### కొనుగోళ్లకు అంతా సిద్ధం..



ఈ నెల రెండో వారంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. ఇప్పటికే ధాన్యం వచ్చి ఆరి సిద్ధంగా ఉన్న హాజీపూర్, దండేపల్లి, లక్షెట్టిపేట మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభిస్తాం. జిల్లాకు 53.87 లక్షల గన్నీలు అవసరం ఉండగా, 27.13 లక్షల గన్నీలు అందుబాటులో ఉన్నాయి. మిగితా 26.74 లక్షల్లో మిల్లర్ల వద్ద 2.50 లక్షలు ఉన్నాయి. సప్లయర్స్ నుంచి 21 లక్షల గన్నీల కోసం ఇండెంట్ పెట్టాం. త్వరలోనే జిల్లాకు చేరనున్నాయి. కేంద్రాల వద్ద గన్నీల కొరత లేకుండా చూస్తున్నాం. రైతులు నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి సహకరించాలి.

**-గెడాం గోపాల్, సివిల్ సప్లై డీఎం, మంచిర్యాల**

### ప్రణాళిక బద్ధంగా కొంటాం



ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఈ ఏడాది వాన కాలం వరి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక రూపొందించి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తాం. ఇప్పటికే కొనుగోలు ఏజెన్సీలు, మిల్లర్లకు, ట్రాన్స్‌పోర్టర్లకు సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశాం. మరో రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సైతం సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేస్తాం. రైతులు ధాన్యాన్ని పొలం వద్దనో, ఇంటి వద్దనో ఆరబోసి ఆరిన తర్వాత కేంద్రాలకు తీసుకురావాలి. ప్రభుత్వ నాణ్యతా ప్రమాణాల మేరకే ధాన్యం సేకరించడం జరుగుతుంది. త్వరలోనే జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం.

**-సబావత్ మోతీలాల్, అదనపు కలెక్టర్(రెవెన్యూ), మంచిర్యాల**

## ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప, జడ్పీ వైస్ చైర్మన్ కృష్ణారావు

కాగజ్‌నగర్, నవంబర్ 4: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్రీడా మైదానంలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరిశీలించా రు. ఈ నెల 8న ముఖ్య మంత్రి కేసీఆర్ కాగజ్‌నగర్ కు రానున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. వివిధ మండలాల నుంచి వచ్చే కార్యకర్తలు, నాయకులకు, బీఆర్‌ఎస్ పార్టీ అభిమానులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజా ఆశీ ర్వాద సభ విజయవంతం చేయాలని ఆయన కోరా రు. జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు క్రిష్ణరావు, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు వీవీ ప్రసాద్, తదితరులన్నారు.



అవార్డుల ప్రశంసాపత్రాలతో ఉద్యోగులు

## అంకిత భావంతో పనిచేయాలి

ఆసిఫాబాద్, నవంబర్ 4: ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి అదిలాబాద్ రీజియన్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆర్‌ఎం సోలోమాన్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన రీజినల్ స్థాయి ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో పాల్గొన్నారు. ఆసిఫాబాద్ డిపో నుంచి ఆదర్శ ఉద్యోగులుగా ఎంపికైన డ్రైవర్లు రవీందర్, కండక్టర్ లక్ష్మణ్, పీహెచ్‌బీ డ్రైవర్ శంకర్, మెకానిక్ వెల్డర్ సురేశ్‌ను ఘనంగా సత్కరించి , ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు ప్రణీత్, ప్రవీణ్, ఆసిఫాబాద్ డిపో మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజు రెండే..

- మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ఒక్కోటి చొప్పన..

బెల్లంపల్లి/ గర్మిళ్ల, నవంబర్ 4: మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కలిపి శనివారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. బెల్లంపల్లిలో రెండవ రోజు శనివారం ఒక నామినేషన్ దాఖలైంది. యూసీసీఆర్‌ఐఎంఎల్ అభ్యర్థి అంబాల మహేందర్ తన నామినేషన్ ప్రతాన్ని ఎన్నికల అధికారి రాహుల్‌కు అందించారు. ఇక మంచిర్యాల నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా జన్నారం మండలం దేవునిగూడకు చెందిన గవ్వల శ్రీకాంత్ తన నామినేషన్ దాఖలు చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మంచిర్యాల ఆర్డీవో రాములుకు ఆయన నామినేషన్ పత్రాలు అందజేశారు.

## ముహూర్తం చూడండి

- పురోహితులు, సిద్ధాంతులను కలుస్తున్న ఎన్నికల అభ్యర్థులు
- 4,7,8,9,10 తేదీలు మంచి రోజులంటున్న పండితులు
- ఆయా తేదీల్లో నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు

తాండూర్, నవంబర్ 4: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి మొదలైంది. ఈ నెల 10వ తేదీన ఈ ఘట్టం ముగియనున్నది. కాగా, నామినేషన్లు వేసేందుకు 4, 7, 8, 9, 10 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నట్లు పురోహితులు, సిద్ధాంతులు సూచిస్తున్నారు. అయితే మంచి రోజును చూసుకునే అభ్యర్థులంతా నామినేషన్లు వేయనున్నారు. మొదటి రోజు శుక్రవారం అయినప్పటికీ షష్టి కావడంతో ఎవరూ నామినేషన్లు వేసేందుకు సుముఖత చూపించకపోవడంతో తక్కవగా పడ్డాయి. 4న శనివారం సప్తమి ఉంది ఈ రోజు కూడా నామినేషన్లు తక్కువగానే పడ్డాయి. 7న మంగళవారం దశమి, 8న బుధవారం దశమి తదుపరి ఏకాదశి వస్తుంది. 9న గురువారం దశమి తదుపరి ఏకాదశి, 10న శుక్రవారం ద్వాదశితో కూడిన ముహూర్తాలున్నాయి. దాంతో అత్యధికంగా 7,8,9 తేదీల్లో నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

**మంచి రోజులే అనుకూలం..**



నామినేషన్లు వేసేందుకు ఈ నెల 4,7,8,9,10న మంచి రోజులు న్నాయి. వీటిలో 4వ తేదీన శనివారం కాబట్టి ఆ రోజు వద్దని కొంత మంది భావించే అవకాశం ఉంది. అత్యంత అ నుకూలంగా ఈ నెల 7,8,9,10 తేదీల్లో శుభగడియాలున్నాయి. కాబట్టి ఈ తేదీల్లో నామినేషన్లు దాఖలు చేసేందేకు ఎంతో అనుకూలంగా ఉంటాయి.

**-అప్పాల శ్యాంప్రణీత్ శర్మ, వేదపండితుడు, అచ్చలాపూర్, తాండూర్**

## బీజేపీకి రాజీనామా



కుమ్రం వందన

ఆసిఫాబాద్,నవంబర్ 4: ఆసిఫాబాద్ ఆసెంబ్లీ టికెట్ ఇవ్వకపోవడంతో ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కుమ్రం వందన రాజీనామా చేస్తున్నట్లు శనివారం వెల్లడించారు. ఈమేరకు తన నివాసంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే టికెట్ ఆశించిన తనకు పార్టీ మోసం చేసిందని, మహిళలకు ప్రాధాన్యం లేదని ఆరోపించారు. మభ్యపెట్టి మోసం చేశారన్నారు. మహిళలు బీజేపీకి ఓటేసే అవకాశమే లేదన్నారు, తనను నమ్ముకొని ఉన్న కార్యకర్తల కోసం స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని స్పష్టం చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

★ *హైదరాబాద్* నందు వృద్ధులను *వారి ఇంట్లోనే ఉండి* చూసుకోవడానికి వర్కర్స్ కావలెను. ఉచిత వసతి, భోజనం. జీ: 15-25 వేలు, ఏజెంట్ కమీషన్: 3-5 వేలు, M/F, 20-50 సం||లు. *హేమ హోమ్ హెల్త్‌కేర్*-7330746999.
NT-320244-All

PLOT FOR SALE

★ హైదరాబాద్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహేడ, జనచైతన్య, బాటసింగారం శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును/ అమ్మబడును, నో Brokers. Ph: 9666912111, 7995005999.
NT-318030

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

